

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలి

ఉక్కు మంత్రికి ఎంపీ లేఖ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు ఉద్యమం ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కోరారు. ఈమేరకు కేంద్రమంత్రికి రాసిన లేఖను శుక్రవారం విడుదల చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుము వర్కింగ్ క్యాపిటల్ సరఫరా చేయడానికి సెయిల్ ద్వారా బిడ్ వేయించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఉక్కు మంత్రిని కోరారు. సెయిల్‌లో ఉపయోగించని ముడి ఇనుముతో ఉక్కు తయారు చేసుకునేందుకు విశాఖ ఉక్కులో సౌలభ్యముందని, అలా చేయడం వల్ల సెయిల్‌కు మేలు చేకూరుతుందన్నారు. ఆ దిశగా ఆదేశాలు ఇవ్వాలని లేఖలో కోరారు.

సమస్యలు తీరేనా..?

- వంశధార నిర్వహణకు నిధుల్లేక సాగునీటి ఇబ్బందులు
- పథకాలు సరిగ్గా పనిచేయక పల్లెల్లో నీటి ఎద్దడి
- టిడ్కో ఇళ్లకు లబ్ధిదారుల ఎదురుచూపులు
- పశు బీమా కోసం పాడి రైతుల నిరీక్షణ
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లాపరిషత్ నూతన సమావేశం మందిరంలో శనివారం నిర్వహించనున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయి ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో ఇప్పటికీ రైతుల వద్ద వేలాది టన్నుల ధాన్యం ఉండిపోయింది. జిల్లాలో ప్రధానమైన సాగునీటి వనరుగా ఉన్న వంశధార ప్రాజెక్టులో కాలువలు దయనీయంగా ఉన్నాయి. కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడంతో రెండు సీజన్లలోనూ శివారు భూములకు సక్రమంగా సాగునీరందలేదు. వేసవి నేపథ్యంలో పల్లెల్లో నీటి ఎద్దడి సమస్యలు మొదలయ్యాయి. పశువుల బీమా డబ్బులు రాక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వీటితోపాటు విద్యుత్, ఆర్ అండ్ బి రోడ్లు తదితర సమస్యలూ ఉన్నాయి. వీటిపై సభ్యులు చర్చించి ఏం పరిష్కారం చూపుతారన్నది చూడాల్సి ఉంది.

జిల్లాలో వంశధార ప్రాజెక్టు ప్రధానమైన సాగునీటి వనరు. కాలువల నిర్వహణ సరిగా లేక ప్రతి ఏడాది శివారు భూములకు నీరందని పరిస్థితి నెలకొంది. 2022 ఖరీఫ్, 2022-23 రబీ సీజన్‌లో ఎడమ కాలువ పరిధిలోని టెక్కలి, పలాస, వజ్రపుకొత్తూరు, కుడి కాలువ పరిధిలోని గార మండలాలకు నీరందలేదు. కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తాయి. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ గతేడాది రూ.63 లక్షలను కేటాయించారు. ఈ ఏడాదీ నిధులను కేటాయించి గుర్రపుడెక్క తొలగిస్తే గానీ శివారు భూములకు నీరందే పరిస్థితి లేదు. దీంతోపాటు కాలువగట్లు బలహీనంగా ఉండడంతో పూర్తిస్థాయిలో నీరు విడిచిపెట్టే అవకాశం లేదు. కుడి కాలువ సామర్థ్యం 2,480 క్యూసెక్కులు కాగా, 1800 క్యూసెక్కులకు మించి నీటిని విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా ఎడమ కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 500 క్యూసెక్కులకు మించి విడుదల చేసే అవకాశం లేదు.



ఆమోదానికి నోచని కరకట్టల ప్రతిపాదనలు

కరకట్టలకు సంబంధించి కొత్త ప్రతిపాదనలను అధికారులు పంపి ఏడాదిన్నర గడుస్తున్నా ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. నిర్మాణ వ్యయం అధికంగా ఉండడంతో వైసిపి ప్రభుత్వం వాటిని ఉన్నపళంగా ఆపేసింది. ముంపు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి నది పరివాహక ప్రాంతంలో ఐదు ప్రాంతాలను గుర్తించారు. అక్కడ కరకట్టల నిర్మాణానికి రూ.13.5 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు. వంశధార వెంబడి మొత్తం 23 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం చేపట్టేందుకు రూ.130 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ రెండింటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఆమోదం తెలపలేదు.

టిడ్కో ఇళ్లు ఎప్పుడు ఇస్తారో..?

శ్రీకాకుళం నగరంతో పాటు ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పట్టణాల్లో కేటాయించిన టిడ్కో ఇళ్ల పనులు నేటికీ పూర్తి కాలేదు. శ్రీకాకుళం మండలం పాత్రునివలస మొదటి దశ మినహా మిగతా నాలుగు చోట్ల మౌలిక వసతుల పనులు అసలు ప్రారంభమే కాలేదు. పాత్రునివలస రెండో దశ, ఆమదాలవలస మండలం భైరిశాస్త్రులపేట, పలాస-కాశీబుగ్గలోని బొడ్డపాడు, ఇచ్ఛాపురంలోని అమీన్‌సాహెబ్‌పేటలో కనీసం రోడ్లు కూడా వేయలేదు. జిల్లాలో పాత్రునివలసలో నిర్మిస్తున్న మొదటి దశ ఇళ్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినా ఇళ్లను మాత్రం అప్పగించలేదు.

షట్టర్ల సమస్యకు ఏం పరిష్కారమో?

నరసన్నపేటలో 2009లో నమోదైన సిఐడి కేసు 13 ఏళ్లు గడుస్తున్నా కేసు తేలకపోవడంతో, కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కార్యాలయాల్లో సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల విలువ చేసే షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వీటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాలంటే కేసుకు ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై జిల్లాకు చెందిన మంత్రులు దృష్టిసారిస్తే సమస్య పరిష్కారం కాగలదని అంతా భావిస్తున్నారు.

రెండేళ్లు కావస్తున్నా అందని పశు బీమా

జిల్లాలో రెండేళ్ల కాలంలో సుమారు 2,400 పశువులు మరణించాయి. వాటికి సంబంధించి సుమారు రూ.14 కోట్లు రావాల్సి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు కలిసి తమకు ఎప్పుడు డబ్బులు వస్తాయా అని అడుగుతున్నారు. ప్రభుత్వం పాత బీమా పథకాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్త పథకం అమలుకు జిఒ ఇచ్చినా అది అమలు కాలేదు. దీంతో పశువులు మరణించినా, పథకంలో నమోదు కాకపోవడంపై పాడి రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

పల్లెల్లో మొదలైన దాహం కేకలు

గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 4037 గ్రామాలు ఉండగా కేవలం 1518 గ్రామాలకే తాగునీరందుతోంది. 2519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీటి సరఫరా అవుతోంది. జిల్లాలో 38 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సిపిడబ్ల్యుఎస్) ఉన్నాయి. వాటిలో ప్రతి పథకంలో ఏదో ఒక మరమ్మతుతోనే నడుస్తోంది.

జిల్లాలో 38 పథకాల నిర్వహణ కోసం రూ.16.41 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. తాగునీటి పథకాల పనితీరును పర్యవేక్షించే కీలకమైన జెఇ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయలేదు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత 51 మంది జెఇలు పనిచేయాల్సి ఉండగా, 34 మంది మాత్రమే ఉన్నారు. 17చోట్ల ఖాళీలు ఉన్నాయి. ఐదు మండలాల్లో జెఇలు లేరు. రణస్థలం, లావేరు, కోటబొమ్మాళి, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో జెఇ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సమస్యలపై నిలదీతలు

ప్రజాశక్తి - పలాస, టెక్కలి



ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను నిలదీస్తున్న మహిళలు

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు పలు సమస్యలపై ప్రజలు నిలదీశారు. పలాస - కాశీబుగ్గ మున్సిపాల్టీ పరిధిలోని 15వ వార్డులో మంత్రి అప్పలరాజు ఇంటింటికీ వెళ్తున్న సమయంలో తనకు పెన్షన్ అందడం లేదని స్థానికుడు కిషోర్ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పెరాలసిస్‌తో బాధపడుతున్న తనకు పెన్షన్ కోసం ఆరు నెలలుగా మున్సిపల్ అధికారులు, సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని నిలదీశారు. అధికారులతో మాట్లాడతానని మంత్రి అప్పలరాజు వెళ్లిపోయారు.

దువ్వాడని నిలదీసిన మహిళలు

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి శ్రీనివాస నగర్ కాలనీలో కొద్ది నెలలుగా రేషన్ బియ్యం అందడం లేదని ఆ ప్రాంత మహిళలు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను నిలదీశారు.

దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. స్థానిక నాయకులకు చెప్పినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై దువ్వాడ సమాధానం చెప్తుండగా మహిళలు నిలదీస్తూనే ఉండడంతో తన కార్యాలయానికి వస్తే మాట్లాడతానని చెప్పి వెనుదిరిగారు.

సిహెచ్‌సి సూపరింటెండెంట్‌పై వేటు?

డాక్టర్ మేఘనకు బాధ్యతలు అప్పగింత

ప్రజాశక్తి - పలాస



చిన్నంనాయుడు

పలాస సిహెచ్‌సి సూపరింటెండెంట్‌గా డాక్టర్ చిన్నం నాయుడును తొలగించినట్లు సమాచారం. ఆయన స్థానంలో ఆస్పత్రిలో జనరల మెడిసిన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన భార్య మేఘనను నియమించినట్లు తెలుస్తోంది. రాజకీయ కక్షతోనే చిన్నంనాయుడుపై వేటు పడినట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కుత్తం లక్ష్మణ్‌పై వైసిపి నాయకుడు నర్తు ప్రేమ్ కుమార్ చేసిన దాడిలో ఆయన కాలు విరిగింది. ప్రభుత్వాస్పత్రిలో చేరిన ఆయనకు ఎముకల విభాగ వైద్యులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్నంనాయుడు చికిత్స అందించారు. లక్ష్మణ్ కాలు విరిగినట్లు నివేదిక ఇవ్వవద్దని వైసిపి నాయకులు ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. అయినా ఆయన నివేదిక ఇవ్వడంతో అధికార పార్టీ నాయకుల ఆగ్రహానికి గురికావాల్సి వచ్చిందని ప్రచారం సాగుతోంది. గతేడాది నవంబరులో ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన మడే రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన స్థానంలో నవంబరు 16న చిన్నంనాయుడు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల్లోనే ఆయన్ను తప్పించినట్లు సాగుతున్న ప్రచారం స్థానికంగా చర్చనీయాంశమైంది. దీనిపై చిన్నంనాయుడును వివరణ కోరగా తనకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని చెప్పారు.



స్టిక్కర్‌ను ఇంటి గోడకు అంటిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

జగనే జన నినాదం

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

'జగనన్నే మా భవిష్యత్' ప్రారంభం

ప్రజాశక్తి - నరసన్నపేట, ఆమదాలవలస, పలాస

'జగనన్నే మా భవిష్యత్' పేరిట రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలను నేరుగా కలిసే భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని మఠం వీధి నుంచి ధర్మాన కృష్ణదాస్, ఆమదాలవలసలో క్యాంపు కార్యాలయంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో గల 15వ వార్డులో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నని గెలిపించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రతి గడపకూ వెళ్లగలుగుతున్నామంటే ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలే కారణమన్నారు. ముఖ్యమంత్రి చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై బురద జల్లుతున్న ప్రతిపక్షాల తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ తరుపున సచివాలయ కన్వీనర్లతో పాటు గృహ సారథులు తొలిసారి ప్రజలతో మమేకం కావడానికి ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

ఒక రాజకీయ పార్టీ కార్యకర్తలుగానే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చే బాధ్యత గల పౌరులుగా పనిచేస్తారని చెప్పారు. ప్రభుత్వ పనితీరుపై, పార్టీపై ప్రజల అభిప్రాయాన్ని, సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటారన్నారు. ఇంటి యజమాని అనుమతితో వారి ఫోన్, ఇంటి డోరుపై స్టిక్కర్లను అతికించాలన్నారు. జగనన్న పాలనకు మద్దతు తెలిపేందుకు 8296082960 ఫోన్ నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఇంటి యజమానికి అభ్యర్థించాలని సూచించారు. ప్రతి గృహ సారథి వారికి కేటాయించిన క్లస్టర్లలో ప్రతిరోజూ 10 నుంచి 15 గృహాలను సందర్శించాలన్నారు. గత ప్రభుత్వాల ఆలోచనలకు భిన్నంగా.. ప్రజల జీవితాల్లో, వారి జీవనశైలిలో వచ్చిన మార్పును కళ్లకు కట్టినట్టు చూపించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతిపక్షాలు వికృత చేష్టలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ రథానికి అడ్డంపడే ప్రయత్నాలు, కుట్రలు చేస్తున్న దుష్టశక్తులకు ఈ కార్యక్రమం తగిన గుణపాఠం చెప్తుందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, ఎంపిపి ఎ.మురళి, జెడ్‌పిటిసిలు బెండి గోవిందరావు, ఎల్.కాంతారావు, పలాస మున్సిపల్ వైస్ చైర్మన్ బి.కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, వైసిపి ఆమదాలవలస మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, నాయకులు కె.సత్యనారాయణ, బొడ్డేపల్లి రమేష్ కుమార్, హనుమంతు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్ అని భవిష్యత్ లేకుండా చేశారు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు



మాట్లాడుతున్న రవికుమార్

ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతిపాల్జేసి భవిష్యత్ లేకుండా చేశారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని తాడివలస పంచాయతీ గంగ్రేడు, వెంకమ్మపేట, లచ్చయ్యపేటలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అంటూ మోసపూరిత హామీలతో అధికారం చేపట్టి నిరుద్యోగ యువతకు భవిష్యత్ లేకుండా చేశారని అన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినేని మణెమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర్, భాస్కరరావు, చింతాడ కృష్ణవాసుదేవరావు, బాడాన శేషగిరి, వండాన మురళి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై రాజకీయ కక్ష

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రామారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



రాజకీయ కక్షసాధింపులో భాగంగానే బిజెపి ప్రభుత్వం రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు విమర్శించారు. బిజెపి ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో పోస్టుకార్డు ఉద్యమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలిందన్నారు. సిబిఐ, ఇడి వంటి దర్యాప్తు వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని రాజకీయ దురుద్దేశంతో తప్పుడు కేసులు బనాయిస్తోందని విమర్శించారు.

మోడీ, అమిత్ షాను విమర్శించినా, ప్రశ్నించినా వారిని లొంగదీసుకోవడానికి రాజకీయ దురుద్దేశంతో తప్పుడు కేసులు పెడుతున్నారని చెప్పారు. మోడీ, అదానీ బంధాన్ని పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ అడిగినందుకు సమాధానం చెప్పలేక కక్షపూరితంగా వ్యవహరించారన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రెల్ల సురేష్ ఆధ్వర్యాన పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. దేశ ప్రజలకు అదానీ అక్రమాలపై మోడీ సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.భత్ శివకుమార్ మణికంఠ, కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు, డి.గోవింద మల్లిబాబు, పప్పల వెంకటరమణ, అంబటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పలు చర్చిల్లో క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫౌండర్ ప్రెసిడెంట్ ఫాస్టర్ రెవరెండమ్ డాక్టర్ కృపానందం, సహాయ ఫాస్టర్ రెవరెండమ్ జాన్ జీవన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలో సామూహిక ప్రార్ధనలు చేశారు. గుడ్ ఫ్రైడే ఆవశ్యకతను వివరించారు.



మాట్లాడుతున్న గుండ లక్ష్మీదేవి

మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు

- నాసిరకం మద్యంలో విష రసాయనాలు
- విచ్చలవిడిగా మత్తు పదార్థాల విక్రయాలు
- మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తానని నమ్మబలికిన జగన్, అధికారంలోకొచ్చాక రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. అరసవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మద్యాన్ని 5 స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తామన్న నమ్మబలికి, మాట తప్పి మడమ తిప్పారన్నారు. నాసిరకం మద్యాన్ని తయారు చేయించి రూ.వేల కోట్ల అక్రమాలకు తెరతీశారని ఆరోపించారు. నాసిరకం మద్యం తాగిన వారి నాడీ వ్యవస్థ దెబ్బతిని అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. మద్యం మత్తులో అత్యాచారాలు, గ్యాంగ్ రేప్‌ల సంఘటనలు రాష్ట్రంలో పలు జిల్లాల్లో నమోదయ్యాయని చెప్పారు. మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్స్‌కు అనుమతి ఇవ్వకుండా నగదు లావాదేవీలతోనే వ్యాపారం సాగిస్తుండడం వల్ల లాభాల్లో గోల్‌మాల్ చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని విమర్శించారు.

దేశంలో ఏ మూలన గంజాయి పట్టుబడినా దాని మూలాలు రాష్ట్రంలోనే ఉంటున్నాయన్నారు. ఎపిలో గంజాయి పరిమాణం మూడేళ్లలో మూడు రెట్లు పెరిగిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి వెల్లడించారని చెప్పారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థాల విక్రయాల కట్టడిలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో తెలుగు యువత అధ్యక్షులు కైబడి రాజు, మండల అధ్యక్షులు ఎల్.రాధాకృష్ణారెడ్డి, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి జి.సురేష్, కేశవ రాంబాబు, ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21న పాత వాహనాల వేలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రభుత్వ విధుల కోసం వినియోగించి ప్రస్తుతం కాలపరిమితి ముగిసిన తొమ్మిది నాలుగు చక్రాల వాహనాలను ఈనెల 21న కలెక్టరేట్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలం రవాణా శాఖ నిబంధనల ప్రకారం రవాణా శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనాలనుకునే వారు తమ ఫర్మ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, జిఎస్‌టి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌తో ఈనెల 20వ తేదీ లోపు కలెక్టరేట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తు నిమిత్తం రూ.వెయ్యి డిమాండ్ డ్రాఫ్ట్ కలెక్టర్, శ్రీకాకుళం పేరున చెల్లించి మరుసటి రోజు వేలానికి హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో పాట ఖరారైన తర్వాత మూడు రోజుల్లో పాటదారుడు మొత్తాన్ని చెల్లించి వాహనాన్ని ఐదు రోజుల్లో తీసుకెళ్లాలని పేర్కొన్నారు. మూడు రోజుల్లో మొత్తాన్ని చెల్లించకపోతే పాటదారుడు డిపాజిట్ మొత్తాన్ని కోల్పోతారని తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయ వేళల్లో డిఆర్ఒ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

తాబేళ్ల సంరక్షణతో పర్యావరణ సమతుల్యత

ప్రజాశక్తి - నౌపడ

ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణతో పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి అన్నారు. భావనపాడు సముద్ర తీరంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి అప్పారావు ఆధ్వర్యాన 400 ఆలివ్‌రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. కార్యక్రమంలో అటవీశాఖ అమలపాడు రేంజ్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, భావనపాడు సర్పంచ్ బి.మోహన్ రెడ్డి, ఎంపిటిసి రాజ్యలక్ష్మి, ఎండయ్య రెడ్డి, ఆనంద్, పంగ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న నాయకులు

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

ప్రజాశక్తి
www.prajasakti.com

వీల్ మార్కర్‌తో వంద శాతం మొలకలు


పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి-రణస్థలం

వరి కోతల అనంతరం దున్నకుండా డబుల్ వీల్ మార్కర్ యంత్రంతో నేరుగా విత్తడం వల్ల వంద శాతం మొలక సామర్థ్యం ఉండటంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. రైతుల సమక్షంలో శుక్రవారం లావేరు మండలం చినలింగాలవలసలో రైతు మిత్ర మీసాల రాము ఈ పద్ధతిలో సాగుచేసిన మొక్కజొన్న ప్రదర్శనా క్షేత్రంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దిగుబడి సుమారు 42 నుండి 45 క్వింటాళ్ల వచ్చే అవకాశం ఉందన్నారు. రైతు మిత్ర మీసాల రాము మాట్లాడుతూ ఈ ఏడాది డబుల్ వీల్ మార్కర్‌తో దున్నకుండా మొక్కజొన్న సాగు చేయడం వల్ల కూలీల సమస్య బాగా తగ్గిందన్నారు. పురుగులు, తెగుళ్ల సమస్య అంతగా లేనందున పురుగు మందుల పిచికారీపై పెట్టే ఖర్చు కూడా తగ్గిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పి.తవిటినాయుడు, ఆర్.కృష్ణ, గ్రామ పెద్దలు లెంక అబ్బినాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలి అవసరం

శ్రీకాకుళం అర్బన్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో బ్యాక్ టు ది రూట్స్ థీమ్‌పై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అన్నెపు శివప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను గుర్తించి అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించడానికి 'బ్యాక్ టు ది రూట్స్' అనే థీమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతిఒక్కరూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే పాత పద్ధతులను అవలంబించడాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిరుధ్ కుమార్, క్రిటికల్ కేర్ విభాగం డాక్టర్ జి.సందీప్, ఎమర్జెన్సీ విభాగం డాక్టర్ కె.ప్రకాష్, సెంటర్ హెడ్ డాక్టర్ సాగరిక, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

పోలాకి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీనాథ్, ఎన్.రవికుమార్ ఆధ్వర్యాన ఆశా, వైద్య ఆరోగ్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు మార్చుకొని, మద్యం, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే మంచి ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. ఆరోగ్య సేవలు, సమగ్ర ఆరోగ్య పరీక్షలు, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, శేఖర్‌బాబు, రత్నం, దమయంతి, శైలజ, పూర్ణ, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హటకేశ్వరస్వామి వేడుకలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం మండలంలోని సింగుపురంలో గల పార్వతీ కొండమ్మ సమేత హటకేశ్వరస్వామి కళ్యాణాది యాత్ర మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. గత నెల 28 నుంచి శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో అనువంశిక ధర్మకర్త గొండు ఆదిత్యనాయుడు ఆధ్వర్యాన వేడుకలను నిర్వహించారు. ఉత్సవంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను నందీశ్వరునిపై ఉంచి ఊరేగింపు చేపట్టారు.

ఆలయంలో అన్నదానం

సోంపేట: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే బి.అశోక్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

టెక్కలి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. టాటా మ్యాజిక్, ఒక కారు, మోటారు సైకిల్, వాహనాలకు బహిరంగ వేలం వేస్తున్నామని, ఆసక్తిగల వారు హాజరు కావాలని కోరారు.

ప్రజా మద్దతుకే 'మా నమ్మకం నువ్వే జగన్'


ఇచ్ఛాపురం : స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలు చేసేందుకు వచ్చిన నర్తు, పిరియా

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

అర్హతే ప్రామాణికంగా అర్హులకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. నాలుగో వార్డు జిఐసి కాలనీలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్‌తో కలిసి 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని రామారావు శుక్రవారం ప్రారంభించారు. తొలుత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వారి మద్దతు కోరారు. కార్యక్రమంలో సీడాప్ ఎపి ఛైర్మన్ శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, పి.రాజ్యలక్ష్మి, బి.పుష్ప, పి.దేవదాస్‌రెడ్డి, ఉలాల దివ్య భారతి, లాభాల స్వర్ణమణి, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: మండల కేంద్రంలో 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రారంభించారు. శ్రీనివాస నగర్ కాలనీలోఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమ పాలన వైసిపికే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పి.జగన్మోహన్, వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: పైడిభీమవరం మహి గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడారు. 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్'పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. గత టిడిపి ప్రభుత్వానికి ప్రస్తుత వైసిపి పాలనను పోల్చి చెప్పే కరపత్రాలు అందిచడం, ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలు అడిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్.నాయుడుబాబు, బల్లాడ హేమమాలినిరెడ్డి, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటరత్నం ప్రసాద్, నెరపల సత్యనారాయణ, పెద్ద రామునాయుడు, డి.చిల్ల వెంకటరెడ్డి,ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ప్రజలంతా వైసిపికి మద్దతుగా నిలవాలని తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం జాడుపల్లి, పట్టుపురం, చాపర, మెళియాపుట్టిలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించి, బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాడి అప్పారావు, ఆదినాయుడు, గణేష్ ప్రధాన్, కన్నబాబు, ఎ.రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు పి.చంద్రరావు, బోసి రామారావు, సంపతిరావు లక్ష్మి, వాసు, గౌరీసు, తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని శిలగాం పంచాయతీలో ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. కపాసుకుద్ది పంచాయతీలో వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడు పులకల శ్రీరాములు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ విధివిధానాలు, అమలు చేస్తున్న పథకాలు వివరించారు. ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో శిలగాం సర్పంచ్ ప్రతినిధి కడియాల బాబురావు, సచివాలయ కన్వీనర్ కొర్రాయి గోపాల్, ధర్మరాజు, రమేష్ నాయుడు, పాతిన వెంకటరావు, గృహ సారథులు పాల్గొన్నారు.

నందిగాం: జగన్‌తోనే సంక్షేమ రాజ్యం, అభివృద్ధి సాధ్యమని కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. కవిటి అగ్రహారం గ్రామంలో సర్పంచ్ బొమ్మాలి గున్నయ్య, మర్లపాడు గ్రామంలో సర్పంచ్ దట్టి తనుజ వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల మద్దతు కోరారు. కవిటి అగ్రహారంలో మేళ తాళాలతో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి గ్రామస్తులు, మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కె.బాలకృష్ణారావు, భైరాగి, సువ్వారి వసంతకుమార్, ఆర్.కూర్మారావు, చిన్ని జోగారావు, తమిరి రాజు, ధనరాజ్, ఆర్.ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : పోస్టర్‌ను అందిస్తున్న మామిడి శ్రీకాంత్

సోంపేట: మండలంలోని జింకిభద్ర, బెంకిలి పంచాయతీ, సచివాలయాల పరిధిలో ఎంపిపి దాసు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జగన్‌కు మద్దతు తెలపాలని కోరారు. స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో టి.శేఖర్, పిరియా ధర్మేంద్ర, సాహుకాని జానీ, షణ్ముఖరావు, కోటరాజు, చింత ప్రకాష్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కొత్తపల్లి పంచాయతీలో ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి డి.వెంకటరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గత ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వానికి గల తేడాను అడిగి తెలుసుకున్నారు. మద్దతు తెలిపిన వారి డోర్‌కు స్టిక్కర్లు అటికించారు. కార్యక్రమంలో హేమసుందరరాజు, రామారావు, వెంకటరావు, సింహాచలం, వినోద్, రవి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని జెఆర్.పురం పంచాయతీ దన్నానపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు, సర్పంచ్ బి.రమణ, ఉప సర్పంచ్ సీతారాం వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన ఇళ్లకు స్టిక్కర్లు అటికించారు. కార్యక్రమంలో పచ్చిగుళ్ల సాయిరాం, వి.పాణికుమార్, పి.గౌరినాయుడు, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని సీపన్నాయుడుపేటలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు సాధు వైకుంఠరావు, వార్డు ఇన్‌ఛార్జి సీపాన రామారావు, నాయకులు పైడి రాజారావు, ఎంపిపిలు అంబటి నిర్మల శ్రీనివాసరావు, గొండు రఘురాం మెంటాడ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు సమస్యల ఏకరువు


ఆమదాలవలస : స్పీకర్‌కు సమస్యను వివరిస్తున్న మహిళ

ప్రజాశక్తి - ఆమదాలవలస

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాంకు ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు లక్ష్ముడుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ ప్రభుత్వం గృహ నిర్మాణం కోసం ఇస్తున్న రూ.1.80లు ఏ మూలకు సరిపోవడంలేదని, ఈ విధానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మార్పు చేయాలని స్పీకర్ ‌ు కోరారు. పప్పల కనకమ్మ మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇళ్ల పట్టాను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిమ్మాపురంలో ఇచ్చారని, అక్కడ ఇంటిని నిర్మించుకోవడానికి తమకు సాధ్యపడడం లేదని స్పీకర్ దష్టికి తీసుకువచ్చారు. తిమ్మాపురం కొద్ది రోజులకు మెయిన్ సెంటర్‌గా మారుతుందని, కనుక వెంటనే అక్కడ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలని లబ్ధిదారుకు సూచించారు. లక్ష్ముడుపేట వెనక వీధి నుండి వెంకయ్యపేటకు రహదారిని మంజూరు చేయాలని స్పీకర్‌ను ప్రజలు కోరారు. గతంలో లక్ష్ముడుపేట నుంచి వెంకయ్యపేటకు రింగ్ రోడ్డును మంజూరు చేశానని స్పీకర్ చెప్పగా, సగం రోడ్డునే వేశారని గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే మున్సిపల్ ఎఇ అప్పలనాయుడును పిలిచి రోడ్డు సగంలో నిలిచిపోవడానికి గల కారణాలు తెలపాలని ప్రశ్నించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేశామని కొన్ని అనివార్య కారణాల వల్ల పనులు నిలిచిపోయాయని అన్నారు. మురుగునీరు, చెత్త కుప్పలతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని మున్సిపల్ శానిటేషన్ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని స్పీకర్ దష్టికి ప్రజలు తీసుకొచ్చారు. కమిషనర్ రవి సుధాకర్‌ని పిలిచి చెత్త కుప్పలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. కరోనా రెండో వేవ్ లో తన భర్త మరణించారని, నేటికీ వైఎస్ఆర్ బీమా అందలేదని బాధితురాలు బైరెడ్డి భారతి స్పీకర్‌కు తెలిపారు. సంబంధిత అధికారులతో స్పీకర్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం వైఎస్ఆర్ బీమా రేషన్ కార్డులో ఒక్కరికే వర్తించడం వల్ల మతుడు పేరున బీమా లేకపోవడంతో వర్తించలేదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దుంపల చిరంజీవి, బొడ్డేపల్లి రమణమూర్తి, బొడ్డేపల్లి రాజు, సాధు చిరంజీవి, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: వైసిపితోనే రాష్ట్రానికి నిజమైన సంక్షేమం వచ్చిందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కొమనాపల్లి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. గ్రామంలోని 600 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు ఎంపిపి వాన గోపి, వైసిపి మండల కన్వీనరు కనుసు సీతారాం, నాయకులు ఎం.శ్యామలరావు, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన ముసలినాయుడు, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు దామ మన్మథరావు, కొమనాపల్లి సర్పంచ్ కనుసు సీతమ్మ, కరవంజ సర్పంచ్ జుత్తు నేతాజీ, చల్లవానిపేట పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు వాన కనకయ్య, వాన రాజు, టి.సతీష్ కుమార్, కె.హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పట్టణంలోని ఆంధ్రా బాపిస్టు చర్చిలో పి.విజయ్‌కుమార్, తాతాజీబాబు ఆధ్వర్యాన గుడ్ ఫ్రైడే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వజ్రపు వెంకటేష్, శివరావు, దిలీప్, మూర్తి, ప్రత్తి అన్వేష్, అమిత్, ప్రవీణ్, జోష్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: చాపరలోని క్రైస్తవ మందిరంలో నిర్వహించిన గుడ్‌ఫ్రైడే వేడుకల్లో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్ పాల్గొన్నారు. క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే విశిష్టతను తెలియజేశారు. అనంతరం క్రిస్టియన్లు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ జోసఫ్, క్రిస్టియన్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధ్యాయునికి సత్కారం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

సంతబొమ్మాళి: ఉపాధ్యాయ వృత్తికే మణిపాత్రుని శ్రీనివాసరావు ఆదర్శమని నరసాపురం సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి అన్నారు. నరసాపురం యుపి పాఠశాలలో పనిచేసి ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. శ్రీనివాసరావు నిత్యం పాఠశాలకు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు చక్కని విద్యాబోధన చేశారని అన్నారు. ఈయనను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నూకరాజు, రామకృష్ణ, మురళి, విజయ భాస్కరమ్మను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనందరావు, విద్యా కమిటీ ఛైర్మన్ ధర్మారావు పాల్గొన్నారు.

12న నిరాహార దీక్ష

కవిటి: విద్యార్థుల శ్రేయస్సు కోసం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ఒకరోజు నిరాహార దీక్ష చేయనున్నట్టు ఇచ్ఛాపురం జనసేన పార్టీ సమన్వయకర్త దాసరి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కవిటి బస్టాండ్ ఆవరణలో దీక్ష చేయనున్నట్లు తెలిపారు. సంపూర్ణ మద్దతు తెలిపిన ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. మిగతా స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువత మద్దతు తెలిపి దీక్ష విజయవంతానికి సహకరించాలని కోరారు.

ఆడిట్ తప్పనిసరి


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ఆమదాలవలస: మండలంలోని అన్ని గ్రామ సంఘాలు, స్వయంశక్తి సంఘాలు అంతర్గత ఆడిట్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది పనితీరు ఆధారంగా, ప్రగతిలో వెనుకబడిన సిబ్బందికి పుస్తక నిర్వహణ, తదితర అంశాలపై అదనపు శిక్షణ అవసరమని తెలిపారు. గ్రామస్థాయిలో కొంతమంది సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోకపోతే, పర్యవసానం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ప్రతి గ్రామ సంఘం వార్షిక ఆడిట్‌ను చార్టర్డ్ అకౌంటెంట్‌తో చేయించుకొని, జిల్లా సహకార అధికారికి సకాలంలో రిటర్న్స్ సమర్పించాల్సి ఉందని, అందరూ అన్ని రకాల పుస్తకాలను ఆడిట్ చేయించుకోవడానికి సిద్ధపరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విఒఎలు, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు, రమణ, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశయన సాధికారత కమిటీ సభ్యునిగా కృష్ణంరాజు


కృష్ణంరాజు

పలాస: టిడిపి రాష్ట్ర శ్రీశయన సాధికార కమిటీ మెంబరుగా పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టుపురం గ్రామానికి చెందిన బూరెల కృష్ణంరాజును నియమించారు. రాజమండ్రిలో తెలుగుదేశం పార్టీ బిసి విభాగం శెట్టి బలిజ, శ్రీశయన, గౌడ, ఇడిగ, యాత, గీత సహకులాల సాధికారత సమావేశంలో పాల్గొని ప్రమాణ స్వీకారం చేసారు. జిల్లా కమిటీలో కొర్నాన నాగేష్, సిస్టు ప్రసాద్‌ను నియమించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ , గౌతు శివాజీ, శిరీషకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలగనున్నదని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సత్తార్ బయ్యానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఆమదాలవలస ఇండోర్ సబ్-స్టేషన్ పరిధిలో గల 11 కె.వి. బిఆర్.నగర్ ఫీడర్, 11కెవి వెంగళరావు కాలనీ ఫీడర్ పరిధిలో రోడ్ క్రాసింగ్ దగ్గర స్తంభాలు వేస్తున్నామని, ఈ కారణం వల్ల ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కెవికె, మొదలవలస రమేష్ ఐటిఐ, ఎంపిడిఒ కార్యాలయం, అగ్రికల్చర్ ల్యాబ్, గేట్ సచివాలయం, తదితర ప్రాంతాలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన హరికథ

ఆమదాలవలస: మండలంలోని కొత్తవలస గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన హరికథ గానం శుక్రవారంతో ముగిసింది. గ్రామంలోని కోదండ రామాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హరికథా గానాన్ని తొమ్మిది రోజులపాటు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రూ.272 గరిష్ట కూలి పొందాలి

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు


కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఉపాధి హామీ కూలీలు రెండు పూటలు పని చేసి, గరిష్ట కూలి రూ.272 పొందాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. శుక్రవారం పెద్ద లక్ష్మీపురం పంచాయతీలో జరుగుతున్న అమృత్ సరోవర చెరువు అభివృద్ధి పనులను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం 6గంటల సమయం ఉపాధి పనులు చేస్తే గరిష్ట వేతనం పొందడంతో పాటు మీ గ్రామాల్లో సుస్థిరవనరులు ఏర్పడతాయన్నారు. ఉపాధి పనులను మీ సొంత పనులుగా భావించి చేయాలన్నారు. కూలీలకు కొలతలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, పారదర్శకంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్, ఇసి ఆదినారాయణ, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

రూ.3.26 కోట్ల ఆస్తికి బినామీ మంత్రేనా!


మాట్లాడుతున్న వజ్జ బాబురావు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గలో రూ.3.26 కోట్లు విలువ చేసే ఆస్తిని మంత్రి అన్నయ్య త్రినాథ్ కొనుగోలు వెనుక బినామీ ఎవరో చెప్పగలరా? అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు మంత్రి సీదిరి అప్పలరాజుకు సవాల్ విసిరారు. పలాస నియోజకవర్గంలో కొండలు, గుట్టలు, వాగులు సైతం ఆక్రమణకు గురవుతున్నాయని పదే పదే ఆరోపిస్తున్న వైసిపి నాయకులు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి అప్పలరాజు అబద్ధాలాడుతూ బల్లలు గుద్దుతున్నారని, తన వెనుక ఉండే నాయకుల చరిత్రపై మాట్లాడకుండా వెనకేసుకొస్తున్నారన్నారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులు చేపల వృత్తి చేపడుతూ జీవనం సాగిస్తున్నామని, ఇల్లు కూడా లేదని పేర్కొన్న మంత్రి ఇటీవల పలాస కెటి రోడ్డులో రూ.3.26 కోట్లకుపైబడిన భవనాన్ని ఎలా కొనుగోలు చేశారని, ఇంత పెద్ద మొత్తంలో నగదు ఎక్కడి నుంచి వచ్చిందో, దాని వెనుక బినామీ ఎవరో చెప్పాలని ప్రశ్నించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా పలాసలో అమ్మకం దారులు లేకుండానే కొనుగోలు చేశారని, కోర్టు పరిధిలో కుటుంబీకుల సమస్య ఉండగా ఎవరి ప్రోద్బలంతో రిజిస్ట్రేషన్ అయ్యిందో తెలపాలని కోరారు. ఇటీవల నిర్వహించిన భూ సమస్యలపై స్పందనలో సర్వే నెంబరుతో సహ ఫిర్యాదు చేస్తే నేటికీ వాటిపై మంత్రి, రెవెన్యూ అధికారులు ఎందుకు సర్వే చేపట్టలేదో బదులివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లొడగల కామేశ్వరరావు, నాగరాజు, టి.రవిశంకర్ గుప్తా, నవీన్, శ్రీనివాసరావు, యాదగిరి, శంకర్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - కవిటి

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని జై భీమ్ సేన అధ్యక్షుడు నగిరి మోహనరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని కాజూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా దేశానికి దిశా నిర్దేశం చేశారని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి అంబేద్కర్ అహర్నిశలు శ్రమించారని అన్నారు. అంబేద్కర్ జీవిత చరిత్ర తెలుసుకుని, ఆయన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అంబేద్కర్ చిత్ర పటాలను ఇంటింటికీ అందించారు. అనంతరం మోహనరావును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డి.వెంకటరావు, బి.రామకృష్ణ, సురేష్, విజయభాస్కర్, మనోజ్, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధంపై మడమ తిప్పిన జగన్

ప్రజాశక్తి - ఆమదాలవలస

మద్యపాన నిషేధాన్ని అమలుచేసి ప్రజలను ఓటు అడుగుతానన్నా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆ హామీపై మాట తప్పి, మడమ తిప్పారని టిడిపి నాయకులు మొదలువలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్ మండిపడ్డారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాపురాల్లో మద్యం చిచ్చు పెడుతుందని, మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని అందుకే అధికారంలోకి వచ్చిన తరువాత మూడు దశల్లో మద్య పానం నిషేధించి ఫైవ్‌స్టార్ హోటల్స్‌కు మాత్రమే పరిమితం చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ నాలుగేళ్ల పాలనలో రూ.41వేల కోట్లు మద్యంపై సంపాధించారని ఆరోపించారు. డిస్టలరీల ద్వారా నాశిరకం మద్యం తయారు చేసి, ప్రజల ధన, ప్రాణాలను హరిస్తున్నారని మండిపడ్డారు. మద్యంపై వచ్చే ఆదాయాన్ని 15ఏళ్లకు తాకట్టుపెట్టి, బ్యాంకుల నుంచి రూ.33వేల కోట్లు అప్పుతెచ్చారని గుర్తు చేశారు. 15 ఏళ్లు కుదువపెట్టిన జగన్ మద్యపాన నిషేధం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. మహిళలపై దాడులు పెరిగాయని అన్నారు. పట్టణంలో సాండ్, ల్యాండ్, మట్టి మాఫియాలు చెలరేగిపోతున్నాయని, దీన్ని అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, ఎస్.మురళి, టి.అమర్‌నాథ్, బి.గోవిందరావు, శివ్వాల సూర్యం, ఎ.భాస్కరరావు, కోరుకొండ మల్లేశ్వరరావు, లావేటి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ప్రజల్ని వంచించారు

టెక్కలి: సిఎం జగన్ నాలుగేళ్ల పాలనలో ప్రజలను వంచించారని టిడిపి మండల నాయకులు మట్ట పురుషోత్తం, మామిడి రాము అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మద్యం మీద రూ.41వేల కోట్లను దోచుకున్నారని అన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని, రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి మాఫియా పెరుగుతోందన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, హెచ్.రామకృష్ణ, పి.షణ్ముఖరావు, జగదీష్, దమయంతి, మధు, కాళీ పాల్గొన్నారు.

రూ.41 వేల కోట్లు దోపిడీ

పలాస: మద్యపానం నిషేధిస్తామని అధికారంలోకి వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నాలుగేళ్లలో రూ.41వేల కోట్లు మద్యం ద్వారా ప్రజల నుంచి దోపిడీ చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ మద్యాన్ని రద్దు చేస్తూ తన బినామీ, వైసిపి నాయకుల డిస్టలరీల్లో తయారు చేసిన నాశిరకం మద్యం బ్రాండ్ల విక్రయాలతో రూ.వేల కోట్లు సంపాధించుకున్నారని ఆరోపించారు. చెన్నైలోని ఎస్‌జిఎస్ ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో మద్యంలో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు ఉన్నాయని తేలిందని పేర్కొన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలు దొరకడంతో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాళ్లపై పడి కాపరి మృతి

టెక్కలి: మండలంలోని రావివలసకు చెందిన గొర్రెలు, మేకల కాపరి దాసరి కామేశ్వరరావు(57) శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు రాళ్ల కుప్పలపై పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వికలాంగుడైన కామేశ్వరరావు మేకల మందను మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఆయన రాళ్ల కుప్పలపై పడటంతో తలకు తీవ్రగాయమైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాలు విడిచాడు. మేకల మందను తీసుకెళ్లిన కామేశ్వరరావు ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. రాళ్ల గుట్టపై మృతి చెంది ఉండటంతో బోరున రోదించారు. మృతునికి భార్య ధనరాజులు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న ఎఎస్‌పి



చిత్రపటాన్ని అందుకుంటున్న ఎఎస్‌పి

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి అమ్మవారిని శ్రీకాకుళం అడిషనల్ ఎస్‌పి విఠలేశ్వరరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ అమ్మవారి ఫొటో, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహితుడు రాజేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి విశిష్టతను వివరించారు.

ఆర్థికసాయం అందజేత

పలాస : మందస మండలం నల్ల బొడ్డులూరు గ్రామానికి చెందిన సోపింటి రాజేష్ ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రంగోయి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మృతునికుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ షణ్ముఖరావు ఆచారి, సోప్ ఇంటికృష్ణ చారి, లక్ష్మణరావు, రామమూర్తి, ఇసాకోటి అప్పలస్వామి పాల్గొన్నారు.

రాస్తారోకోకు అనుమతివ్వాలని వినతి


స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దాసరి రాజు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని ఎల్‌సి గేటు సమస్యపై ఈనెల 9న చేపట్టనున్న రాస్తారోకోకు అనుమతించాలని స్టేషన్ మాస్టర్ టికె.సాహు, పట్టణ పోలీసులను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు కోరారు. శుక్రవారం వారిని కలిసి వినతిపత్రం అందించారు. ఎల్‌సి గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులను కోరామని, వారు స్పందించకపోవడం వల్ల ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శాంతియుతంగా రాస్తారోకో చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జనసేన పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

'ఆసరా' చెక్కు పంపిణీ


మాట్లాడుతున్న శ్రీనివాస్

నందిగాం: మండల కేంద్రంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తుందని, అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాల అమలు చేస్తుందని ఆయన అన్నారు. రూ.13,372 మందికి రూ.10.72కోట్లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, శ్రీరాములు, జె.జయరాం, కె.నారాయణమూర్తి, ఎర్ర చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.